ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 357 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

ఉరుములు, మెరుపులతో భారీ వాన

రాష్ట్రంలో పలుచోట్ల వర్షం

పాలమూరు జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

హైదరాబాద్‌లో భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలమయం

ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల ఇక్కట్లు

అధికారులను అప్రమత్తంచేసిన సిఎం రేవంత్

నగరంలో తక్షణ చర్యలు చేపట్టాలన్న మంత్రి పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని పలు జిల్లాలో పిడుగులు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో పిడుగుపడి ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అమ్రాబాద్ ఉమ్మడి మండలంలోని పదర కోడోనిపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపడింది. కండ్లగుంట గ్రామ సమీపంలో వేరుశనగ పంట పొలాల్లో కూలి పనులు చేస్తుండగా పిడుగుపడి సుంకరి సైదమ్మ, వీరమ్మ అనే కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా సుంకరి లక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొని ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలో వర్షం కురిసింది. దీంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. హిమయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హోటల్ వద్ద ఓ ..మిగతా 2లో

చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్

గచ్చీబౌలి భూములపై ప్రభుత్వానికి షాక్

చట్టాన్ని ఎలా చేతుల్లోకి తీసుకుంటారు

ఎలాంటి పనులు చేపట్టవద్దన్న సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా ..మిగతా 2లో

హెచ్‌సీయూ భూములపై మొండి వైఖరి వీడాలి

హైకోర్టు చీవాట్లు పెడుతున్నా.. రేవంత్ బుద్ధి మారటం లేదు

మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): హెచ్‌సీయూ భూముల వేలంపై సీఎం రేవంత్‌రెడ్డి మొండివైఖరిని వీడనాడాలని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ హై కోర్టు చీవాట్లు పెడుతున్నా రేవంత్ ప్రభుత్వం తీరు మారదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సీఎం అంటే బాస్ కాదు ప్రజా సేవకుడని అన్నారు. అర్ధరాత్రి బుల్డోజర్లతో హెచ్‌సీయూ యూనివర్సిటీలోకి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ..మిగతా 2లో

పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

ముగిసిన ఇరుపక్షాల వాదనలు తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యింది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని ..మిగతా 2లో

రాజ్యసభకు వక్ఫ్ సవరణ బిల్లు

సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

సుదీర్ఘ చర్చ అనంతరం ఓటింగ్

బిల్లు రాజ్యాంగంపై దాడి అన్న సోనియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా ..మిగతా 2లో

థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

బిసి రిజర్వేషన్ల కోసం పోరాడుతాం

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు రాహుల్ హామీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం): బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో కొట్లాడుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. గురువారం పార్లమెంట్‌లో అగ్రనేతలు సోనియా,రాహుల్ ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల బృందం కలిసింది. బుధవారం జంతర్ మంతర్ లో బీసీ రిజర్వేషన్ల ధర్నా వివరాలను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ అగ్రనేతలకు వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ..మిగతా 2లో

ఉరుములు, మెరుపులతో భారీ వాన

మొదటి పేజీ తరువాయి...

కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర సచివాలయం ముందుభాగం చెరువును తలపిస్తోంది. ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. పలుచోట్లు- చెట్లు- కూలిపోయాయి. స్తంభాలు ఒరిగిపోయాయి. ఖైరతాబాద్- పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకు నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షం, ఈదురుగాలులతో రాజధాని హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు- ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల పై నీటి నిల్వలు లేకుండా ట్రాఫిక్ సమస్య, విద్యుత్ అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, విభాగాలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని ఆదేశించారు. జిల్లాల్లో కూడా వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో హైదరాబాద్ లో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎర్రమంజిల్ ప్రాంతంలో చెట్టు- కూలడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ ఐఆర్టి టీమ్స్ వాటిని క్లియర్ చేసింది. సెక్రటేరియట్, రాజ్ భవన్ రోడ్, మసబ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలతో పాటు- నగరంలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంట వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రోడ్లపై వరద ప్రభావం వల్ల ట్రాఫిక్ ఏర్పడిందని అరగంటలోపు వాటర్ క్లియర్ చేస్తామని అధికారులు తెలిపారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా రపూశి జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఐయామ్ లో జరిగిన అభివృద్ధిని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జరుగుతున్న విధ్వంసాన్ని ముఖ్యంగా శేరిలింగంపల్లి లో హెచ్ సి యూ లో జరుగుతున్న విధ్వంసం ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఇప్పటికే ప్రజలు గమనిస్తున్నారని, నాడు కెసిఆర్ ప్రకృతిని కాపాడుతూ హరితహారం పేరుతో చెట్లు నాటి జీవరాశులకు, భవిష్యత్ తరాలకు ప్రాణాధారమైన ఆక్సిజన్ శాతాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా చెరువులు, కుంటలు ప్రాజెక్టులతో జలకళతో తెలంగాణ రాష్ట్రం పరిపూర్ణంగా ఉండేదని, కానీ నేడు ఆ పరిస్థితి కానరావడం లేదని ఎక్కడ చూసినా ఎండిన చెరువులు, కుంటలు, అభివృద్ధి పేరుతో చెట్లు నరకడం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఇవన్నీ కూడా ప్రజలకు తెలియ చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా రాబోయే రోజుల్లో అధికారంలోకి వస్తుందని ప్రతీ కార్యకర్తను కూడా పార్టీ గుర్తుపెట్టుకుని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నెల 27వ తేదీన జరుగు ప్లీనరీ కార్యక్రమాన్ని విజయం వంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, కూకట్ పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, గోపరాజు శ్రీనివాస్ రావు, కలిదిండి రోజా, బిఎస్ ఎం కిరణ్ యాదవ్, మెడ్ ప్లస్ శ్రీనివాస్, సయ్యద్ ముజిద్, మారబోయిన రవి యాదవ్, శ్రీకాంత్, సాయి మిద్దెల మల్లారెడ్డి, ఆర్కే గౌడ్, తిరుమలేష్, శ్రీనివాస్ గౌడ్, సలీం పాషా, బాబు మియా, ఎడివ శ్రీకాంత్, పండరి శ్రీకాంత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ సీ (ఎస్ఈఏ) ఆధ్వర్యంలో శ్రీ సీతరామ కళ్యాణం...ఉగాది పురస్కారాలు

వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ప్రముఖ వ్యక్తులకు సన్మానం

టీపీసీసీ అధికార ప్రతినిధి, సీ (ఎస్ఈఏ)జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) సనాతన ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ఎస్ఈఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ విశ్వావసు నామ ఉగాది పురస్కారాల 2025 ప్రధానోత్సవ బ్రోచర్ ని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఎస్ఈఏ జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం ఇందుమతి శ్రీరంగం దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ ఈ నెల 5న ఉప్పల్ భాగయత్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతీ స్వామీజీ మంగళ శాసనాలతో స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ సీతారామ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని, అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఉగాది వేడుకల సంబరాలు పురస్కరించుకొని బ్రాహ్మణ సమాజానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు ఇతర రంగాలలో విజయం సాధించిన ప్రముఖ వ్యక్తులను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సోదరీసోదరమణులందరు పెద్ద ఎత్తున హాజరై ఉగాది పురస్కారాలు జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉగాది పురస్కారల కన్వీనర్ ఆర్ సి మూర్తి, సీ వ్యవస్థాపకులు ముళ్లపూడి అమ్రిత్, సీ తెలంగాణ అధ్యక్షులు సాయి ప్రసాద్, సమన్వయకర్త శరన్ కండల, జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పీసపాటి, శ్రీరంగం ఫౌండేషన్ కో- చైర్‌పర్సన్ శ్రీమతి ఇందుమతి శ్రీరంగం, మహిళా విభాగం కార్యదర్శి శిరీష పుల్లే, రాజ్య లక్ష్మి యువజన విభాగంప్రధాన కార్యదర్శి గౌతమ్ వలివేటి, శశి హరి, పవన్, లక్ష్మి మోహన్ తదితలులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు- తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటు-ందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏంటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన పనులపై స్టే విధించింది ఉన్నత న్యాయస్థానం. అయితే సుప్రీంకోర్టు తీర్పుపై హెచ్‌సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గాలంటూ డిమాండ్ చేస్తున్నారు. గో బ్యాక్ పోలీస్ అంటూ నినాదాలు చేస్తున్నారు. భారీ వర్షంలోనూ నిరసనలు తెలుపుతున్నారు. విద్యార్థుల నినాదాలతో యూనివర్శిటీ ప్రాంగణం దద్దరిల్లుతోంది.

హెచ్‌సీయూ భూములపై మొండి వైఖరి వీడాలి

మొదటి పేజీ తరువాయి...

హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని చెప్పారు. భూముల వివాదంలో విద్యార్థులను మంత్రులు చులకనగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీకి 14 వేల ఎకరాలు ఉండగా హైదరాబాద్‌లో ఉన్న భూమిని ఎందుకు తీసుకుంటున్నారని నిలదీశారు. హెచ్‌సీయూలో వన్యప్రాణులు లేవని ఎలా చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. దయచేసి కంచె గచ్చిబౌలి 400 ఎకరాలను ఎవరు కొనవద్దని అన్నారు. ఇప్పుడు కంచె గచ్చిబౌలి భూములను ఎవరు కొన్న ఇబ్బందులు పడాల్సివస్తుందని కేటీఆర్ చెప్పారు. మూడేళ్లలో వచ్చేది తమ ప్రభుత్వమేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలపై ఇదే తమ కమిట్మెంట్ అని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక అతిపెద్ద ఎకో పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎవరైనా ఆ భూములు కొంటే మళ్లీ వెనక్కు తీసుకుంటామని తేల్చిచెప్పారు. అద్భుతమైన పార్క్‌గా మార్చి హెచ్‌సీయూకు కానుకగా ఇస్తామని స్పష్టం చేశారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్వికి జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

రాజ్యసభకు వక్ఫ్ సవరణ బిల్లు

మొదటి పేజీ తరువాయి...

చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుంది. లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించినట్లు-గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను సాక్షదాయాలతో సహా బయటపెడతాం

కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) పది సంవత్సరాల బిఆర్ఎస్ గవర్నమెంట్ లో జరిగిన అవినీతి అక్రమాలను సాక్షాధారాలతో సహా బయట పెడతామని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హెచ్చరించారు. హెచ్ సి యూ భూమి వివాదం పై బిఆర్ఎస్, బిజెపి విధానాలపై రమేష్ బాలానగర్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హెచ్ సి యూ భూముల వివాదాన్ని విద్యార్థులను ముందు పెట్టి రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. కూకట్ పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు హెచ్ సి యు భూములపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం ముఖ్యమంత్రిని విమర్శించడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దొంగే దొంగ అన్నట్లు కృష్ణారావు తీరు ఉందన్నారు. గత 1%శ% ఏళ్లలో కూకట్ పల్లి నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, శిఖం భూములు చివరకు నాలాలను సైతం వదలకుండా కబ్జా చేసాడని వీటన్నింటి వ్యవహారం బయటకు తీస్తామని ఎమ్మెల్యే తీరును ఎండగడతామని రమేష్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రభుత్వానికి చెందిన ప్రతి ఇంచ్ భూమిని కాపాడుకుంటున్నామని హౌసింగ్ బోర్డ్ కు చెందిన ప్రతి కాళీ స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్నామన్నారు. యూనివర్సిటీ కి చెందిన ఒక అడుగు భూమి కూడా ప్రభుత్వం తీసుకోదని విద్యార్థులు ఆందోళన విరమించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమం పేరుతో 1200 మంది విద్యార్థులను బలిగొన్న చరిత్ర బిఆర్ఎస్ ది అని ఇప్పుడు కూడా హెచ్ సి యూ విద్యార్థులను రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం 16 గంటలు పనిచేస్తున్నారని పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు శిక్షణ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రేషన్ కార్డులు ఇతర సంక్షేమ కార్యక్రమాలు కేవలం నోటిమాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. సన్న బియ్యం తో పాటు మరో 9 నిత్యావసర వస్తువుల కిట్ ను ప్రజలకు త్వరలోనే అందించనున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ కు ఇక భవిష్యత్తులో పుట్టగతులు ఉండబోవన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మయ్య, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి, గోపిశెట్టి రాఘవేంద్ర, కుక్కల రమేష్, మేకల రమేష్, మధు గౌడ్, ఐజాచ్, శివ చౌదరి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అధికారులను అప్రమత్తం చేసిన జలమండలి ఎండీ

హాట్‌స్పాట్లపై దృష్టి పెట్టాలని ఆదేశంలి

మ్యాన్‌హెూళ్ల మూతలు తెరవొద్దని ప్రజలకు వినతి

రంగంలోకి ఈఆర్‌టీ బృందాలు

ఖైరతాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) నగరంలో కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హెూళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, డీప్ మ్యాన్‌హెూళ్ల దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హెూల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వం హెచ్‌సియూ విద్యార్థులపై దుర్మార్గంగా వ్యవహరిస్తే ఊరుకోము

జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) హెచ్ సి యూ భూములను అమ్ముతేనే ఖజానా నిండుతుందా, పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వానికి బాధ్యత లేద, యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులను విచక్షణా రహితంగా కొట్టడం వారిపై కేసులు పెట్టడం దుర్మార్గం అని జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై వెంటనే కేసులు కొట్టివేయాలని, హెచ్ సి యూ 400 ఎకరాల ఆక్రమణ ఆపివేయాలని, లేనిచో జనసైనికులు ఉద్యమించడం తప్పదని అన్నారు.

బిసి రిజర్వేషన్ల కోసం పోరాడుతాం

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారని అన్నారు. మేలు చేస్తే మరచిపోరని చెప్పారు. రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల్లో జీవితాల్లో మార్పులు తెస్తాయని అన్నారు. మరింత కష్టపడి అందరికీ సంక్షేమ ఫలాలను పంచాలని సూచించారు. ఈ సందర్భంగా తనను కలిసి రాష్ట్ర నాయకులను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం టైం స్కేల్ ఉద్యోగులకు రూ.3లక్షల గ్రాట్యుటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న టైమ్ స్కేల్ ఉద్యోగులు

బుద్వేల్, ఏప్రిలో (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 206 మంది టైం స్కేలు ఉద్యోగస్థులకు పదవీ విరమణ పొందిన సమయంలో రూ. 3లక్షల చొప్పున చెల్లిస్తామని వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ అంశాన్ని మార్చి 25వ తేదీన జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మాణం చేయడం జరిగిందన్నారు. గురువారం రాష్ట్రం నలుమూలల నుంచి టైం "స్కేలు ఉద్యోగులు రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్దకు వచ్చారు. వారితో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ. టైం స్కేలు ఉద్యోగస్తులకు దీర్ఘ కాలికంగా ఆపరిష్కృతంగా ఉన్న పదవీ విరమణ ప్రయోజనాల అంశం గురువారు నాడు కొలిక్కి వచ్చిం దన్నారు. 2008వ సంవత్సరంలో ముఖామంత్రిగా ఉన్న దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి ఎన్. రఘు వీరారెడ్డి ల సమయంలో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ వ్యవసాయ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్సు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. అనాటి నుంచి నేటి వరకు ఉద్యోగ భద్రత తప్ప మిగతా ఎలాంటి ప్రయోజనాలు లేకపోవడం, వాటి పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నాలు జరుగలేదని తెలిపారు. ప్రతి టైం స్కేలు ఉద్యోగి 35-40 సంవత్సరాలు విశ్వవిద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ పొందినప్పటికి ఎలాంటి ప్రయోజనాలు లేక రిక్త హస్తాలతో ఇంటికి వెళ్లిపోయిన రోజులు ఉన్నాయన్నారు. గత 17 సంవత్సరాలుగా టైం స్కేలు ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులకు విన్నవించుకుంటు వస్తునే ఉన్నారు. తాను వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బాధ్యతలు చేపట్టాక జీవితాంతం కష్టపడి పనిచేసిన సిబ్బం దికి పదవీ విరమణ సమయంలో ఎలాంటి ప్రయోజనం లేకుండ పోతుందని ఆలోచించి విషయాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఆయన స్పందించి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వనరులు ఉంటే ఇచ్చుకోండని చెప్పడంతో ప్రతి టైం స్కేలు ఉద్యోగికి పదవీ చిరణమ సయయంలో రూ. 3లక్షలు గ్యాట్యుటీగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

వైస్ చాన్సలర్‌కు కృతజ్ఞతలు, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకాలు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టైం స్కేలు ఉద్యోగులకు గ్యాట్యుటీగా రూ. 3లక్షలు చెల్లిస్తామని చెప్పడంతో వర్శిటీలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్తాన్ జానయ్యకు కృతజ్ఞతలు చెబుతు సన్మాణాలు చేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమకు మెడికల్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని, అర్హత ఉన్న టైం స్కేలు సిబ్బందిని ఆయా హెూదాలలో నియమించాలని కోరారు. టైం స్కేలు ఉద్యోగి పనిచేస్తు మరణిస్తే వారి స్థానంలో వారి సంతానానికి అవకాశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమం లో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, ఉద్యోగ సంఘాల నాయకులు ఎం శ్రీనివాస్ యాదవ్, ఎస్ జయ రాం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బందయ్యకు సన్మానం చేస్తున్న న్యాయవాదులు

బుద్వేల్ , ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన జీ. బందయ్య ను బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, శ్రేయోభిలాషులు షాలువ పూల మాలలతో గురువారం ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం తో ఓట్లేసి గెలిపించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీన మధ్యాహ్నం కొత్త గా ఎనికైనా బార్ అసోసియేషన్ కు పూర్తి బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం లో న్యాయవాదులు డి. భూపాల్, కోరని రవీందర్, గణేష్ క్రాంతికుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు

ఈద్ మిలాప్‌లో పాల్గొన్న అధికారులు, నాయకులు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈద్ మిలాప్

బుద్వేల్, ఏప్రిలో(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో గురువారం ఉదయం ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. వర్శిటీ ముస్లీం ఉద్యోగుల ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, డీన్ అగ్రికల్చరల్ డాక్టర్ ఝాన్సీరాణి, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, టీఎన్ జీ వోస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్, వర్శిటీ శాస్త్రవేత్త డాక్టర్ సయ్యద్ నియాద్ అహ్మద్ హుస్సేనీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, ముస్లీం సోదరులు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ. హిందువులు జరుపుకునే దసరా, దీపావళి, సంక్రాతి, ఉగాది, క్రైస్తవులు నిర్వహించే క్రిస్మస్ పండుగల సం దర్భంగా ఆయా మత గ్రంథాలు చెప్పేవి అందరు కలసి సాగడం కోసమేనన్నారు. అందరు కలసి మెలసి ఉండటమే పండుగ అని అదే విధానాన్ని మనమందరం కొనసాగించాల్సిన అవసరం ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ ముస్లీం ఉద్యోగులు అబ్దుల్ మోహిద్, జహంగీర్, మసూద్ మహ్మద్ సలీం, సమీర్, డాకర్ లతీఫ్ పాషా, డాకర్ అలీబాబ. ఆసీఫ్, జహంగీర్, అక్బర్, ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.శ్రీనివాస్ యాదవ్, సామ అమృతరెడ్డి, మహేశ్, ఎం.ఎ నయీమ్, జీ.అంజయ్య గౌడ్, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన సింప్లాన్.. హత్య జరిగిన ప్రాంతంలో బాలుని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మీరాలం చెరువు సమీపంలో బాలుడు హత్య

బుద్వేల్, ఏప్రిల్ (ప్రభాత ఉదయం): హసన్ నగర్ మీరాలం చెరువు పక్కన ఓ బాలుడు హత్యకు గురైనాడు. ఈ సంఘటన గురువారం ఉదయం 7:30 గంటలకు వెలుగు చూసింది. సమాచారం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు బాలుణ్ణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్ నగర్ డివిజన్ మహమూదనగర్ ప్రాంతానికి చెందిన రఫీక్ బ్యాండ్ వాయించే పని చేస్తుంటాడు. అతని కుమారుడు సింప్లాన్ (15) ఇంటి వద్దనే ఉంటాడు. బుధవారం రాత్రి రఫీక్ బ్యాండ్ వాయించడానికి వెళ్లగా సింప్లాన్ రాత్రి 10 గంటలకు స్నేహితులతో కలసి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఉదయం మహమూద్ నగర్ ను అనుకుని ఉన్న మీరాలం చెరువు సమీపంలో సింప్లాన్ హత్యకు గురై పడి ఉన్నాడు. చూసిన స్థానికులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం ఫోటోలను వాట్సాప్ ద్వారా పరిసర బస్తీల ప్రజలకు పంపిస్తే అతను మహమూద్ నగర్ కు చెందిన రఫీక్ కుమారుడు సింప్లాన్ గా గుర్తించారు. విచారణలో స్నేహితులతో కలసి రాత్రి 10 గంటల సమయంలో బయటకు వచ్చిన సింప్లాన్‌ను తెలిసిన మరో ముగ్గురు మిత్రులు కలసి హత్య చేశారని గుర్తించారు. సింప్లాన్ స్నేహితులకు లేని పోని మాటలు చెబుతు ఒకరికొకరు గొడవలు పడేటట్లు చేస్తున్నాడని అగ్రహించిన మిగతా వారు ఆ బాలుణ్ని ని ఇటుక రాళ్లతో మొఖం పై కొట్టి హత్య చేశారని తెలుసుకున్నారు. అనుమానితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. చెడు సహవాసం కారణంగా సింప్లాన్ హత్యకు గురైనట్లు పోలీసులు చెబుతున్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్

చెన్నూర్, ఏప్రిల్ 03. (ప్రభాత ఉదయం): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ కోటపల్లి పోలీస్ స్టేషన్ లో పలువురు రౌడీ షీటర్లను హెచ్చరించారు. కోటపల్లి పోలీస్ స్టేషన్ లో చెన్నూర్ రూరల్ సర్కిల్ లో పరిది లో గల కోటపల్లి, నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిది లోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెదిలి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనకూడదని, గ్రామాల్లో జరిగే ప్రతి విషయాన్ని పోలీస్ లకు తెలియజేయాలని పేర్కొన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని ఎటువంటి కేసుల్లోనైనా పాల్గొంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, నీల్వాయి ఎస్సైలు రాజేందర్, శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

ఈ నెల 5వ తేదీన కాటేదాన్ శాంతినగర్‌లోని రవీస్ బ్రిలియంట్ హైస్కూల్‌లో స్పేస్ ఎక్స్‌పో

బుద్వేల్, ఏప్రిల్3(ప్రభాత ఉదయం) : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కేఐ ల్యాబ్ సహకారంతో ఈ నెల 5వ తేదీన కాటేదాన్ శాం తినగర్ లో గల రవీస్ బ్రిలియంట్ హై స్కూల్ లో స్పేస్ ఎక్స్ ఫో నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ అర్ రజనీకాంత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం 3 గం టల వరకు కొనసాగే ఈ ఎక్స్ ఫో లో విద్యార్థులకు పరిశోధనల నమూనాల తయారీకి కావల్సిన అద్భుతమైన అనుభవం లబించనుందన్నారు. విద్యార్థులలో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారాలను చూపే ఆలోచనల దిశగా ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్, తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి తదితరులు హాజరు కానున్నారని ఎస్ఆర్ రజనీకాంత్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చెన్నూరు మండల అధ్యక్షులు ముత్యాల బాపగౌడ్

చెన్నూర్, ఏప్రిల్ 03. (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చెన్నూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల బాపాగౌడ్ చెన్నూరు మండలంలోని నాగపూర్ గ్రామంలో ప్రారంభించి. లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెన్నూరు మండల అధ్యక్షులు ముత్యాల బాపగౌడ్, చెన్నూర్ మండల యూత్ నాయకులు బుడే రాజబాపు, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆసరాగా ఉండేందుకు రేషన్ లో ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని తినడానికి అనుగుణంగా లేక బియ్యం తప్పుదారి పట్టించి కొందరు దందాలు డబ్బులు పోగేసుకుంటున్నారు. ప్రభుత్వ ధనం వృధా అవడమే కాక నిరుపేదలకు ఏలాంటి ఉపయోగం లేకుండా ఉందనే ఉద్దేశంతో పేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని మరోసారి నిరూపించుకుంది. అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం సాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బందయ్యను శాలువాతో సత్కరిస్తున్న న్యాయవాదులు

రాజేంద్ర నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా జీ.బందయ్య

బందయ్యను సన్మానించిన న్యాయవాదులు

రాజేంద్ర నగర్ ,ఏప్రిల్3(ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన జీ. బందయ్య ను బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, శ్రేయోభిలాషులు షాలువ పూల మాలలతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం తో ఓట్లేసి గెలిపించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు తేదీ 4 ఏప్రిల్ మధ్యాహ్నం కొత్త గా ఎనికైనా బార్ అసోసియేషన్ కు పూర్తి బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం లో న్యాయవాదులు డి. భూపాల్, కోరని రవీందర్, గణేష్ క్రాంతికుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ వ్యవసాయ కలశాల అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం గోవర్ధన్ ను వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగ సంఘాల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు గురువారం కలిసి సన్మానించారు.

180 రోజులు పూర్తయిన స్పెషల్ డ్రైవ్!

3185 కిలోమీటర్ల పైపులైన్, 2.50 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు

సమష్టి కృషి వల్లే మంచి ఫలితాలన్న ఎండీ అశోక్ రెడ్డి

ఖైరతాబాద్, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం) సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్ రెండో విడత పూర్తయింది. గాంధీ జయంతిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ డ్రైవ్ ప్రారంభమైంది. ఈ స్పెషల్ డ్రైవ్ డిసెంబర్ 31 న పూర్తికావడం.. విజయవంతం కావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి జలమండలి అధికారులు, సిబ్బందిని అభినందించి.. ఈ 90 రోజుల్లో మంచి ఫలితాలు రావడంతో ఈ డ్రైవ్ ను మరో 90 రోజులు పొడిగించాలని ఆదేశించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేసి..వర్షాకాలం నాటికి సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. అప్పటి నుంచి మార్చి 30 నాటికి నగరంలోని ప్రాంతాల్లో నిర్విరామంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. అక్టోబర్ 2 నుండి మార్చి 30 నాటికి మొత్తం 180 రోజులు డీ సిల్టింగ్ పనులు చేపట్టారు. ఫలితంగా ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 24,146 ప్రాంతాల్లో 3,185 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 2.50 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు 20 నుంచి 30 శాతానికి తగ్గాయి. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంలో జలమండలి అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. అందరి సమష్టి కష్టం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి సామర్థ్యంతో కష్టపడతామని చెప్పారు. ఇదే స్ఫూర్తి తో జున్ నాటకీ మిగతా మాన్ హోల్ ళ్లు కూడా డీ సిల్టింగ్ పూర్తి చేయాలని సూచించారు.

రోజూ వారీ పర్యవేక్షణకు డాష్ బోర్డ్:

స్పెషల్ డ్రైవ్ పనుల్ని రోజూవారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్ బోర్డ్ ఏర్పాటు చేశారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్ లో నమోదు చేశారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్ లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలాగా ఏర్పాటు చేశారు. వచ్చిన ఫిర్యాదుల సంఖ్యను బట్టి.. ఆ బబుల్ పరిమాణం మారేలా ఏర్పాటు చేశారు. దీని వల్ల సమస్య తీవ్రతను బట్టి దాన్ని పరిష్కరించారు.

ఇదే కాకుండా.. అలాగే ఈ డాష్ బోర్డును ఇప్పటి వరకు శుభ్రం చేసిన పైపు లైన్ల పొడవు, మ్యాన్ హోళ్ల సంఖ్య వివరాలు ఫొటోలతో సహా.. అప్ లోడ్ చేసేలా రూపకల్పన చేశానరు. సిల్ట్ కార్టింగ్ వాహనాలు తిరిగే ప్రాంతాలు జీపీఎస్ సహకారంతో తెలుసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఎక్కడైనా కొత్త పైపులైన్ల నిర్మాణ ప్రతిపాదనను సైతం నమోదు చేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి, వాటిని విశ్లేషించుకునే సౌకర్యం సైతం కల్పించారు.

మూడేళ్ల ఫిర్యాదుల విశ్లేషణ:

ఈ స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసేందుకు గత మూడేళ్లలో వచ్చిన సీవరేజ్ ఫిర్యాదుల్ని విశ్లేషించారు. ప్రధానంగా వినియోగదారుల ఇళ్లల్లో చోకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యల్ని గుర్తించారు. రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే రావడంతో వాటిపై దృష్టి సారించి పరిష్కరించారు.

ప్రజాపాలనలో ముందస్తు అరెస్టులు

ఏబీవీపీ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ పటేల్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం ఇతర అవసరాల కోసం స్వాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నగా విద్యార్థులు అడ్డుకోవటానికి ఆందోళన చేస్తుండగా పోలీసులు అడ్డుకుంటున్నారని ఏబీవీపీ గద్వాల జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ పటేల్ ఆరోపించారు. గురువారం నరేష్ ను పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఉదయం 5:00 గంటల సమయంలో ముందస్తుగా అరెస్టు చేశారు ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు పోరాడుతున్న విద్యార్థులను ముందస్తుగా అరెస్టు చేయడం దేనికి సంకేతం? అని ఆరోపించారు.

ఇది విద్యార్థి హక్కులపై దాడి!

ఇది అధికార దుర్వినియోగం! అన్నారు.

క్యాంపస్‌లో 400 ఎకరాల భూమిని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. అధికారలి బలంతో,అక్రమ అరెస్టులతో, ప్రకృతిని నాశనం చేయాలని చూస్తే ఊరుకునే పరిస్థితి లేదన్నారు.

విద్యార్థులపై దమనకాండ ఆపాలి!

HCU భూములను రక్షించాలి!

విద్యార్థుల గొంతును నొక్కాలని చూస్తే, తెలంగాణలో ఆత్మగౌరవ ఉద్యమం మరింత మిన్నంటుతుంది! రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువత ఏకమై ప్రభుత్వంపై ప్రతిఘటన తప్పదు అని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రేషన్ షాప్‌లో సన్న బియ్యం పథకం ప్రారంబిస్తున్న గద్వాల మండల తాసిల్దార్ మల్లికార్జున్

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ

తహసిల్దార్ మల్లికార్జున్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా గద్వాల పట్టణ పరిధిలోని దౌదర్‌పల్లిలోని రేషన్ షాపుల్లో పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల తహసీల్దార్ మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు సరఫరా చేస్తున్నా తీరును పరిశీలించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఎలాంటి సమస్య రాకుండ సక్రమంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్దిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తారని బియ్యాన్ని ఎవ్వరు కుడా అమ్ముకోవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి అజిత్ కుమార్, నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

పిడుగుపాటు కు జోడెద్దులు మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం)వేర్వేరు చోట్ల గురువారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ రైతు మృతి చెందగా, మరొక్క చోట రెండు కాడెద్దులు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి... మానవపాడు మండలం చంద్రశేఖర్ నగర్ గ్రామానికి చెందిన వెంకటేష్ (42) పశువులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగుపడడంతో వెంకటెష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే పిడుగుపాటుకు గట్టు మండల కేంద్రానికి చెందిన సారాబాయి సిద్దప్ప అనే రైతుకు చెందిన రెండు కాడెద్దులు పిడుగుపాటుకు మృతి చెందాయి.

పిడుగుపాటుకు ఇద్దరు కూలీలు మృతి

నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) నాగర్ కర్నూలు జిల్లా పదర మండలం కోడోని పల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుతో ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.వివరాలలోకి వెళితే సుంకరి సైదమ్మ (40), గాజుల వీరమ్మ (55), సుంకరి లక్ష్మమ్మ తదితరులు తమ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో వేరుశనగ కాయలు తెంచేందుకు కూలీలుగా వెళ్లారు. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఆరంభమైంది. పొలంలో ఒక దగ్గర నిలిచి ఉన్న కూలీలపై నేపథ్యంలో భారీ ఉరుములు మెరుపులు రావడంతో పిడుగు పడింది. ఈ సంఘటనలో సైదమ్మ, వీరమ్మ అక్కడికక్కడే మరణించగా, లక్ష్మమ్మ కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన లక్ష్మమ్మను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వర్షం గ్రామంలో ఎక్కువగా వర్షం కురుస్తుండడంతో మృతదేహాలను ఆసుపత్రికి తరలించలేదు. తమ గ్రామానికి చెందిన మహిళలు ఇద్దరు మరణించడంతో కోడోని పల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

సోమ శ్రీనివాస్ గుప్తా తండ్రి సోమ జగన్నాధం గుప్తా జ్ఞాపకార్థం గురువారం పలువురికి నూతన వస్త్రాలు బహుకరించారు

బంగారు షాపులో చోరీ

కొత్తకోట, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బంగారు షాప్ లో ఉన్న వ్యక్తిని మాటల్లో పెట్టి బంగారు చైన్ ను దొంగలించిన వైనం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది . వివరాలకు వెళితే కొత్తకోట పట్టణంలో ని హనుమాన్ జువెలర్స్ లో ఐదు తులాల బంగారం చైన్ ను ఐదుగురు మహిళలు షాప్ లో ఏదో ఒక వస్తువు కొంటున్నట్టు నటించి బంగారం చైను దోచుకు వెళ్లారు. మహిళలు వెళ్లిన తర్వాత షాపు యజమాని సీసీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం బంగారం చైన్ ను దొంగలేచినట్లు తెలిసిందని షాప్ యజమాని తెలిపారు.

అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు జయభారతీ మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం)చికిత్స పొందుతూ అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకు రాలు జయభారతీ గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు... అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు జయభారతీ గత వారం కర్నూల్ జిల్లాలో తన కూతురు ఇంట్లో ఓ శుభాకార్యానికి హాజరయ్యారు. అక్కడ ప్రమాదవశాత్తు ఆమెకు నిప్పంటుకోవడంతో ఆమె తీవ్రగాయాలాయ్యాయి. హైదరబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ తో పాటు , స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలుగా కొనసాగుతూ పలు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె మృతి పట్ల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఈ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండాలని గత పాలకులు కోరుకున్నారు

కొన్ని రాజకీయ పార్టీలు అబద్ధాల మీద బతుకుతున్నాయి

తెలంగాణ ఎన్ఎస్ యుఐ నాయకులు గొల్ల జాన్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద కక్షతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రధాన ప్రతిపక్షం న్యాయంగా ప్రభుత్వానికి రావాల్సిన భూమిని అడవి కింద జమకట్టి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపుల్ల వేస్తున్న బీఆర్ఎస్ కుళ్ళు రాజకీయలను సమర్ధిస్తూ పోతే రాష్ట్రానికి తిరోగమనం తప్పదని తెలంగాణ ఎన్ఎస్ యుఐ నాయకులు గొల్ల జాన్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మోకాలు అడ్డుతున్న కేటీఆర్ గ్యాంగ్ ను ఇలానే ఉపేక్షిస్తే రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తుందని, ఈ గులాబీ గుంటనక్కల దళం అన్నారు. కేటీఆర్ నీ కుళ్ళు రాజకీయాలు నేడు విద్వేషాలు రెచ్చగొట్టడానికి పనికిరావొచ్చేమో గాని, నువ్వు ఉసి గొల్పిన పిల్లలకు నిజం తెలిసినవాడు నీ మొహం మీద ఊయక మానరని, మనకి అభివృద్ధి చేయడం ఎలాగూ రాదు చేసే వాళ్ళను చూస్తే ఓర్వ లేకపోతున్నారని అన్నారు. ఇకనైనా ఆ కుళ్ళు బుద్ధి మాని రాష్ట్ర ప్రయోజనాలకై రాజకీయం చేయాలని, లేదంటే తెలంగాణ సమాజం క్షమించలేని ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.

వరి కోత మిషన్‌లో పడి బాలుడు మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3 (ప్రభాత ఉదయం) ప్రమాదవశాత్తు వరి కోత మిషన్ లో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మల్దకల్ మండలంలోని నీలిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలిపల్లి గ్రామానికి చెందిన అఖిల రాజుకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రాజు తన వ్యవసాయ పొలంలో మొక్క జొన్న పంట సాగు చేశాడు. గురువారం వరికోత మిషన్ ద్వారా మొక్క జొన్న పంటను కోసారు. రాజు పొలం పనుల్లో బిజీగా ఉన్నాడు. రాజు కుమారుడు జీవన్(8) మొక్క జొన్న పొలంలోకి వెళ్లి ఆడుకుంటూ మిషన్ దగ్గరకు వెళ్లాడు. ప్రమాదశాత్తు కోత మిషన్ ఆ బాలుడ్ని లాగేయడంతో.. బాలుడి దేహం మిషన్ లోకి వెళ్లి నుజ్జునుజ్జయింది. కుమారుడు మృతి చెందడంతో దంపతులిద్దరు కన్నీరుమునీరయ్యారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608